క్లుప్తంగా

చందన అలంకరణలో తిరుమలేశుడు


తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో చందన అలంకరణలో వెంకన్న

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో సోమవారం తిరుమలేశునికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి చందన అలంకరణ చేపట్టారు. చందన అలంకరణలో స్వామిని దర్శించుకున్న భక్తులు పులకించిపోయారు.

గౌరీ సేవా సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

కూర్మన్నపాలెం: జాతీయ గౌరీసేవాసంఘం సర్వసభ్యసమావేశం సోమవారం కూర్మన్నపాలెంలో జరిగింది. ఈ సమావేశంలో నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా విల్లూరి శ్రీనివాసరావు, అధ్యక్షుడిగా మళ్ల అప్పలరాజు, కార్యదర్శిగా దొడ్డి సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా కె. జనార్దనరావు, కోశాధికారిగా ఆడారి అప్పారావు, ముఖ్య సలహాదారులుగా శరగడం సత్యనారాయణ,సన్యాసినాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు. సమావేశంలో అగనంపూడి,కూర్మన్నపాలెం,రాజీవ్‌నగర్,లక్ష్మీపురంకాలనీలకు చెందిన సభ్యులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్‌లకు సీసీ కెమెరాలు తప్పనిసరి


సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న క్రైం సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ సూరిబాబు

పెందుర్తి: ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ సాధ్యమని వెస్ట్ జోన్ క్రైం విభాగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.శ్రీనివాసరావు అన్నారు. ప్రతి అపార్ట్‌మెంట్‌లోనూ తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జీవీఎంసీ 95వ వార్డు పురుషోత్తపురంలోని కంఫర్ట్ హోమ్స్ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్‌లో 150 ఫ్లాట్ల యజమానులు, తమ నివాసాలకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వాటిని ప్రారంభించిన సీఐ మాట్లాడుతూ జోన్ పరిధిలో దొంగతనాల నియంత్రణకు పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామని తెలిపారు. వేసవికాలంలో ప్రజలు చోరీల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు ఎక్కువ రోజులు బయటకు వెళితే తప్పనిసరిగా సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. ప్రతి ప్రాంతంలో రాత్రి సమయంలో గస్తీ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం అపార్ట్‌మెంట్‌వాసులు నూతనంగా ఏర్పాటు చేసుకున్న స్విమ్మింగ్ పూల్‌ను సీఐ ప్రారంభించారు. ఎస్‌ఐ డి.సూరిబాబు, అపార్ట్‌మెంట్ ప్రతినిధులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'ఆదర్శ్'లో జాబ్ మేళా

పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.ఇ.ఫ్లోరా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి ప్రారంభం కానున్న మేళాలో హనీ గ్రూప్ సంస్థలో కొలువులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 2022 నుంచి 2025(చివరి సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులూ అర్హులే) ఉత్తీర్ణత సాధించిన వారు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని తెలిపారు.

పండగల్లో జూదమాడితే కఠిన చర్యలు

పెందుర్తి: అమ్మవారి పండగలు, ఇతర కార్యక్రమాల్లో పేకాట, కోడిపందాలు, గుండాట వంటి జూదాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ హెచ్చరించారు. హైకోర్టు ఆదేశాల మేరకు పోలీస్ స్టేషన్ పరిధిలో పూర్తిగా జూదాన్ని నిషేధించామన్నారు. పండగల్లో అశ్లీల నృత్యాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు కూడా నిషిద్ధమన్నారు. అమ్మవార్ల పండగలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే, ఎంతటివారినైనా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఐపీఎల్ మ్యాచ్‌లు జరుగుతున్న నేపథ్యంలో బెట్టింగ్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బెట్టింగ్ వ్యవహారంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలకు కష్టాలు మొదలయ్యాయి. కరెంట్ బిల్లులు పెంచి షాక్ ఇచ్చిన సర్కారు.. తాజాగా కుళాయి పన్ను బకాయిల పేరుతో ప్రజల నెత్తిన భారం మోపుతోంది. ఎంతలా అంటే వాటిని చూసి నివ్వెరపోయేలా.. అంతటితో ఆగకుండా బకాయిల పేరుతో కుళాయి కనెక్షన్లు **కట్ చేసేస్తున్నారు. దీనిపై ప్రజలు మండిపడుతున్నారు.**

బకాయిల పేరిట బాదుడు!


కణితికాలనీలో మంచినీరు పడుతున్న వృద్ధురాలు


సిద్ధార్థనగర్‌లోని వాటర్ ట్యాంకు

- ఇష్టానుసారంగా నోటీసులు జారీ చేస్తున్న అధికారులు
- చెల్లించకపోతే కుళాయి కట్ చేస్తామని హెచ్చరికలు
- బెంబేలెత్తిపోతున్న ప్రజలు


ప్రజలకు మంచినీరు అందించే కణితి హైస్కూల్‌లో వాటర్ ట్యాంకు


వడ్లపూడి కాలనీలో మంచినీటి కుళాయి

కూర్మన్నపాలెం: మంచినీటి కుళాయి బిల్లులతో జీవీఎంసీ అధికారులు ప్రజలను హడలు గొట్టేస్తున్నారు. ఎప్పటి నుంచి కట్టాలో పూర్తిగా వివరించకుండా చేతికి వచ్చిన అంకెవేసి డిమాండ్ నోటీసులు జారీ చేసేస్తున్నారు. నోటీసు అందిన మూడు రోజుల్లోగా కుళాయి పన్ను చెల్లించకపోతే 3 రోజుల్లో నీటి సరఫరా నిలిపివేస్తామని హెచ్చరిస్తున్నారు.

ఇదీ పరిస్థితి

వాస్తవానికి గత ప్రభుత్వ హయాంలో తెల్ల రేషన్ కార్డు ఉండి కుళాయి వేయించుకుంటే నెలకు రూ.60 చెల్లించాలి. అదే జనరల్ కేటగిరిలో కుళాయి వేయించుకుంటే 1/2 ఇంచికి రూ.120, 1/3కి 168, వన్ ఇంచికీ రూ.600 చెల్లించేవారు. అదే కమర్షియల్‌కు అయితే కిలో లీటర్ వాటర్‌కు రూ.45 చెల్లించాలని నిబంధనలు చెబుతున్నాయి. అయితే అధికారులు అవేవీ పరిగణలోకి తీసుకోకుండా ఇంటి యాజమాని పేరుతో బకాయి అంటూ చేతికి వచ్చిన అంకెతో నోటీసు జారీ చేస్తున్నారు. ఒక్కో ఇంటికి వేలాది రూపాయలు చెల్లించాలంటూ హుకుం జారీ చేస్తున్నారు. తాము ఇంత మొత్తం ఎందుకు బకాయి ఉన్నాము అని ఎవరైనా ప్రశ్నిస్తే సమాధానం చెప్పడం లేదని ప్రజలు వాపోతున్నారు.

అయోమయంలో ప్రజలు

ఎప్పటి నుంచి బకాయి ఉందో అధికారులు వివరించకపోవడంతో తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఒక వైపు జప్తు వాహనాలతో హెచ్చరికలు పెరిగిపోతుండడంతో ఏమీ పాలుపోక తలలు పట్టుకుంటున్నారు. గతంలో ఏ నెలకు ఆనెల బకాయిలను పొందుపర్చుతూ కంప్యూటర్ బిల్లులు వచ్చేవి. వాటికి అనుగుణంగానే ప్రజలు బిల్లులు చెల్లిస్తువచ్చేవారు. దాంతో ఎటువంటి తలనొప్పి ఉండేదికాదని ప్రజలు పేర్కొంటున్నారు.

కణితిలో ఒక ఇంటికి ఏకంగా రూ.13450 బిల్లు కట్టాలంటూ డిమాండ్ నోటీసు జారీ చేశారు. అయితే తాము ఇంట్లో ఉండేది తక్కువ అని..నీరు కూడా తక్కువ వాడుతామని అంత బిల్లు ఎందుకు వచ్చిందో తమకే అర్థం కావడం లేదని ఆ ఇంటి యాజమాని వాపోతున్నాడు. ఇలాగే ఇంచుమించుగా అందరికీ చేతి అంకెలతోనే డిమాండ్ నోటీసులు రావడంతో ఆ ప్రాంత వాసులు కంగారు పడుతున్నారు. ఒకే సారి వేలకు వేలు బిల్లులు చెల్లించాలంటే ఎలా అని వాపోతున్నారు. ఉన్నతాధికారులే జోక్యం చేసుకొని ఎవరు ఎప్పటి నుంచి బకాయిపడ్డారు.. నెలనెలా ఎంత చెల్లించాలన్నది పూర్తిగా తెలియజేస్తే తాము చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని కుళాయి దారులు చెబుతున్నారు.

పాత పద్ధతిలో బిల్లులు ఇవ్వాలి



పాతపద్ధతిలోనే మంచినీటి కుళాయి బిల్లులు ఇవ్వాలి. ఏ నెలకు ఎంతకట్టాలని వివరంగా తెలియజేస్తే ఎటువంటి ఇబ్బందులు ఉండవు. ఇలా వేలాది రూపాయలు ఒకే సారి చెల్లించాలంటే సామాన్యులు చాలా కష్టపడాల్సి వస్తుంది.

– ప్రగడ శంకరరావు, కణితి కాలనీ, వడ్లపూడి

ఎప్పుడూ చూడలేదు



మునుపెన్నడూలేని విధంగా చేతిరాత అంకెలతో నోటీసులు జారీ చేయడం మంచిదికాదు. గతంలో కంప్యూటర్ బిల్లులు ఇవ్వడం వల్ల ఏ నెలకు ఎంత బకాయి ఉన్నది స్పష్టంగా తెలిసేది. అధికారులు ఆ విధానానికి ఎందుకు స్వస్తిపలికారో తెలియడంలేదు. ఈ పద్ధతిలో డిమాండ్ నోటీసులు పేద వర్గాల ప్రజల నెత్తిన భారం వేసినట్లు అవుతుంది.

– బద్దం ప్రసాద్, పాత వడ్లపూడి

స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకులకు సత్కారం


స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన ఉద్యోగులను సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ నుంచి స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు గొందేశి వెంకటరమణ, సంపంగి ఈశ్వరరావు, బి. రామకృష్ణ, శ్రీరాములను సోమవారం సెంట్రల్ స్టోర్స్ వద్ద ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు స్టీల్‌ప్లాంట్ అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. అదే విధంగా యూనియన్‌కు అన్ని విధాలుగా అండగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీయూసీ నాయకులు నక్క వెంకటరమణ, మార్టుపూడి పరదేశి, అండిబోయిన అప్పారావు, పిట్టారెడ్డి, జి. అప్పలరెడ్డి, వి. అప్పలరెడ్డి, ఎస్. చంద్రశేఖర్, డి. అప్పలరెడ్డి పాల్గొన్నారు.


రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి యర్రం పిచ్చమ్మ ఉత్తర క్రియ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన వెంట నాయకులు బొడ్డ గోవింద్, బోగాది సన్నీ ఉన్నారు. – పెదగంట్యాడ

శేషజీవితం ఆనందంగా గడపాలి


స్వచ్ఛంద పదవీ విరమణ పొందిన ఉక్కు ఉద్యోగులను సత్కరిస్తున్న శ్రీనివాసనగర్ అసోసియేషన్ ప్రతినిధులు

అగనంపూడి: అంతర్జాతీయ ఖ్యాతి పొందిన విశాఖ ఉక్కు కార్మికులు, ఉద్యోగులను స్వచ్ఛంద పదవీ విరమణ పేరుతో బలవంతంగా బయటకు నెట్టడం బాధాకరమని జీవీఎంసీ 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, 85వ వార్డు నాయకుడు దుల్ల రాముునాయుడు అన్నారు. అగనంపూడికి చెందిన ముగ్గురు ఉక్కు ఉద్యోగులు నక్కా రామూర్తి, గంధం బాబూరావు, బి.సుబ్రహ్మణ్యం స్వచ్ఛంద పదవీ విరమణ సందర్భంగా శ్రీనివాసనగర్ కాలనీ, అఫీషియల్ నగర్ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. శేష జీవితం ఆనందమయంగా సాగాలని వారు ఆకాంక్షించారు.

కార్యక్రమంలో నాయకులు గంధం వెంకటరావు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఎం.రామారావు, చల్లా శ్రీనివాసరావు, గొల్లవిల్లి కనక భవాని, మేడిశెట్టి విజయ్‌కుమార్, కరణం సత్యారావు పాల్గొన్నారు.

అవయవదాతకు ఘన నివాళి


సీతమ్మ కుటుంబ సభ్యులతో కలిసి శ్రద్ధాంజలి ఘటిస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: బ్రెయిన్ డెడ్ అవడంతో అవయవదానం చేసి నలుగురికి పునర్జన్మ ఇచ్చిన మాతృమూర్తి దివంగత గిన్ని సీతమ్మ అని గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పలనాగిరెడ్డి అన్నారు. భెల్ (హెచ్‌పీవీపీ) విశ్రాంత ఉద్యోగి గిన్ని అప్పారావు భార్య గిన్ని సీతమ్మ పెద్దకర్మను సోమవారం పిలకవానిపాలెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రెయిన్ డెడ్ అయిన సీతమ్మ అవయవాలను దానం చేయడానికి కుటుంబ సభ్యులు ముందుకు రావడంతో నలుగురికి పునర్జన్మ లభించిందన్నారు. ఆమె కుటుంబ సభ్యులను అభినందించారు. ప్రతీ ఒక్కరు సీతమ్మ కుటుంబ సభ్యుల్లా ఆలోచించాలని కోరారు. కార్యక్రమంలో సీతమ్మ కుటుంబ సభ్యులు జి.ఎస్.ఎన్.రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, భెల్ యూనియన్ ప్రతినిధి జె.రాము, శ్రీను, చిన్నా, రమణ, సంస్థ సెక్యూరిటీ అధికారులు వర్మ, ఐ.ఎస్.రాజు, శ్రీనివాస్, త్రిపాఠి పాల్గొన్నారు.

ఉద్వేగం.. ఉద్విగ్నం

- పదవీ విరమణ సభలో కంటతడి పెట్టిన ఉద్యోగులు
- భారంగా వీడ్కోలు


స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల పదవీ విరమణ కార్యక్రమాల్లో ఉదోగి

ఉక్కునగరం: సాధారణంగా ఉద్యోగులు రిటైర్‌మెంట్‌కు ఒకటి రెండేళ్ల ముందు నుంచే సంసిద్ధమవుతారు. ఉద్యోగ విరమణ తర్వాత ఏం చేయాలి.. ఎలా ఉండాలి... ఎలా గడపాలి అనే ప్రణాళిక రచించుకుంటారు. అదే స్వచ్ఛంద ఉద్యోగ విరమణ (వీఆర్‌ఎస్) అయితే కేవలం నెలన్నర ముందు దరఖాస్తు చేయాలి. అంత తక్కువ వ్యవధిలో ఉద్యోగులు భవిష్యత్తు ప్రణాళిక రచించుకోవడానికి సమయం ఉండదు. అదే పరిస్థితి ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్‌లో నెలకొంది. స్టీల్‌ప్లాంట్‌ను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల సంఖ్య తగ్గించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా వీఆర్‌ఎస్ ప్రకటించింది.

కోతలతో మొదలైన అవస్థలు

ఉక్కు యాజమాన్యం గతేడాదిగా సక్రమంగా జీతాలు చెల్లించకపోవడంతో పాటు హెచ్‌ఆర్‌ఏ నిలిపి వేయడం, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ ఎత్తేయడం, ఇన్సెంటివ్ కనీస స్థాయికి తగ్గించడం వంటి చర్యలకు దిగడంతో ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. ఇలా ఎన్నాళ్లు నెట్టుకు రావాలో తెలియని పరిస్థితిలో భవిష్యత్తు గురించి కూడా ఆలోచించకుండా వీఆర్‌ఎస్‌కు పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేశారు. ఇలా 1613 మంది దరఖాస్తు చేసుకోగా అందులో సుమారు 248 మంది ఉపసంహరించుకున్నారు. కొంత మంది దరఖాస్తులను యాజమాన్యం తిరస్కరించింది. చివరకు 1126 మంది వీఆర్‌ఎస్‌కు ఆమోదం తెలిపింది. అలా రిటైర్ అయిన వాళ్లకు నిర్వహిస్తున్న సత్కార కార్యక్రమాల్లో కొంతమంది భావోద్వేగానికి గురైతే మరికొంత మంది కన్నీళ్లు ఆపుకోలేకపోయారు. ఉద్యోగులను వదిలి వెళ్తున్న వీఆర్‌ఎస్ ఉద్యోగులు బాధ్యతల అప్పగింతలు, కుటుంబ సభ్యులతో పలకరింపులు ఇలా ఎక్కడ చూసినా ఉద్విగ్న వాతావరణం కనిపించింది. రేపటి నుంచి తాము ఏం చేయాలి... భవిష్యత్తు ఏంటనే దిగులుతో ఉన్న వారే ఎక్కువగా కనిపించారు. కాగా పదవీ విరమణ కార్యక్రమం అనంతరం ప్లాంట్ నుంచి బయటకు వచ్చిన వారిని తమ కుటుంబ సభ్యులు సత్కరించారు. మరికొంత మంది ఓపెన్ టాప్‌లో ఊరేగుతూ ఇంటికి చేరుకోవడం కొసమెరుపు.


ఊరేగింపుగా ఇంటికి ఉద్యోగి

భక్తి శ్రద్ధలతో రంజాన్


ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి


ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

గాజువాక: పవిత్ర రంజాన్ పండుగను గాజువాక ప్రాంత ముస్లింలు సోమవారం ఘనంగా నిర్వహించారు. అజీమాబాద్‌లోని సున్నీ జామా మసీదు నుంచి కణితి రోడ్, మదీనా మసీదు, కొత్త గాజువాక జంక్షన్, గౌసియా మసీదు, బాబా సయ్యద్ మదీనా షా ఔలియా దర్గా, బీసీ రోడ్ మీదుగా ఈద్గా మైదానానికి శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ప్రత్యేక ప్రార్థనలను భక్తిశ్రద్ధలతో జరిపించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

శాంతిసామరస్యానికి ప్రతీక

వైఎస్సార్‌సీపీ రీజనల్ డిప్యూటీ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. గాజువాక ప్రాంతం శాంతి సామరస్యాలకు ప్రతీక అని పేర్కొన్నారు. నెల రోజులు కఠిన దీక్షలను పూర్తి చేసుకొని రంజాన్ పండుగ చేసుకోవడం, శాంతి మార్గంలో నడవడం, పేదవారికి సాయం చేయడం తదితర అంశాలు అల్లా చూపిన మార్గమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మహ్మద్ ఇమ్రాన్, పల్లా శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ మహ్మద్ రఫీ, నాయకులు ఎస్.ఎం.డి.గౌస్, షౌకత్ అలీ, ముర్తజా, మదీనా వలి, రిజ్వాన్, అన్సర్ వలీ, మోతి, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.


శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు


మాట్లాడుతున్న మసీదు ప్రతినిధులు

అగనంపూడి: ప్రేమ, శాంతి, సహనం, సోదరభావానికి చిహ్నంగా రంజాన్ నిలుస్తుందని మసీద్ ఇ ఇబ్రహిం కమిటీ అధ్యక్షుడు షేక్ రెహమాన్ అన్నారు. 85వ వార్డు ఫార్మాసిటీ కాలనీ లేమర్తి మసీదులో సోమవారం మసీద్ ఈ ఇబ్రహిమ్ కమిటీ ఆధ్వర్యంలో రంజాన్ వేడుకలు నిర్వహించారు. ముందుగా నమాజ్ చేసి అల్లాను పూజించారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర నూర్ బాషా సంఘం కన్వీనర్ షేక్ ఇస్మాయిల్, ప్రతినిధులు సరిపిల్లి ఖాన్ సాహెబ్, అబ్దుల్లా మాస్టార్, వేపగుంట బాబి, నవీన్, షేక్ బాబీ, అన్సర్, శంషుద్దీన్, పీటీ శ్రీను పాల్గొన్నారు.

పెదగంట్యాడ: రంజాన్ పర్వదినాన్ని మండలంలోని ముస్లింలు సోమవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మదీనాబాగ్, ఇస్లాంపేట, చినపాలెం, పెదపాలెం, నడుపూరు, దేవాడ తదితర ప్రాంతాల్లో ముస్లింలంతా ఈద్గా వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఆపై మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో పెద్దలు అమనత్, మాయర్, ఆమీద్, కమురిద్దీన్, షేక్ నన్నా మస్తాన్, దావూద్, అలీ మాస్టర్,సాసీర్ తదితరులు పాల్గొన్నారు.


లేమర్తి మసీదులో నమాజ్ చేస్తున్న ముస్లింలు


ఇస్లాంపేట మసీదులో ముస్లిం మత పెద్దలు


రంజాన్ సందడి

ఆఖరిరోజు పన్ను వసూలు రూ.5.03 కోట్లు


వివిధ సంస్థల నుంచి వసూలైన ఆస్తిపన్ను చెక్కులను జెడ్సీకి అందజేస్తున్న జీవీఎంసీ రెవెన్యూ అధికారులు

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోన్‌లో 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఆస్తిపన్ను రికార్డు స్థాయిలో వసూలైంది. మార్చి నెలాఖరు నాటికి బకాయిలు పూర్తి స్థాయిలో రాబట్టేందుకు జీవీఎంసీ రెవెన్యూ విభాగం చేసిన కృషి ఫలించిందని అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది కృషి, వడ్డీలో 50 శాతం మినహాయింపు కారణంగా ఆర్థిక సంవత్సరంలో ఆఖరిరోజైన సోమవారం ఒక్కరోజే రూ.5.03 కోట్లు వసూలు చేసి రికార్డు నమోదు చేశారు. 1,17,213 అసెస్‌మెంట్లు గల గాజువాక జోన్‌లో మొత్తం ఆస్తి పన్ను రూ.83.80 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఈ బకాయిలను వసూలు చేయడానికి మూడు నెలల కిందట నుంచే దృష్టి సారించిన అధికారులు మార్చినెలాఖరునాటికి రూ.83.29 కోట్లు వసూలు చేయగలిగారు. ఇందులో ఆస్తి పన్ను రూ.69.75 కోట్లు కాగా, ఖాళీ స్థలాల పన్ను రూ.13.54 కోట్లని జోనల్ కమిషనర్ బి.ఆర్.ఎస్.శేషాద్రి తెలిపారు. సహాయ కమిషనర్లు సీహెచ్.రామనారాయణ, ఎం.శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆర్‌ఐలు రెడ్డి మోహన్, కె.శివ, బి.రాజేంద్ర తదితరులు ఆర్థిక సంవత్సరం చివరిరోజైన సోమవారం ఆస్తి పన్ను బకాయిదారులను కలిసి పన్నులను చెల్లించేందుకు ఒప్పించారు. వడ్డీలో 50 శాతం మినహాయింపు ప్రకటించిన తర్వాత రూ.20 కోట్ల పన్ను వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు.

పాలిసెట్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్–2025 పరీక్ష కోసం రిజిస్ట్రేషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన వారు, ఈ ఏడాది చదువుతున్న వారు పాలిసెట్‌కు అర్హులన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.400, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.100 ఫీజు చెల్లించాలన్నారు. ఈ నెల 15 వరకు విద్యార్థులు రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని, 30న పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు.